ప్రజాశక్తి

సోమవారం 20 మే 2024

5

విజయనగరం

23న జాబ్‌మేళా

పార్వతీపురం రూరల్ : స్థానిక శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 23న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ చింతల చలపతిరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాబేళాలో నిట్, ఐసిఐసిఐ బ్యాంక్, హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్, డెక్కన్ కెమికల్స్, ఫాక్స్కాన్, ఆల్గామ్, డైకి అల్యూమినియం ఇండస్ట్రీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డిక్సాన్, కె.ఎస్.హెచ్, ఇసుజు మోటార్స్, హ్యుండాయ్ మోబీస్, ఇన్ఫిలూమ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో రిలేషన్ షిప్ మేనేజర్, ట్రైనీ, బిజినెస్ ఎగ్జిక్యూటివ్, టెక్నీషియన్ ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పై ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐ.టి.ఐ, డిప్లొమో, ఏదైనా డిగ్రీ, బిటెక్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాల లోపు వయసుగల అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఈ ఇంటర్వ్యూలో అర్హత సాధించిన వారికి నెలకు రూ.12వేలు నుండి రూ. 25వేలు వరకు జీతం ఇన్సింటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఇవ్వడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 9440127517 సంప్రదించాలన్నారు.

రైవాడ రిజర్వాయరు

రైవాడ నీరందేనా?

- 25 ఏళ్లుగా ఎదురు చూస్తున్న రైతులు
- భూములు పోయినా పంటలకు అందని నీరు
- పరిశ్రమలకు తరలించడంపై తీవ్ర విమర్శలు

ప్రజాశక్తి - వేపాడ

వేపాడ మండలం విజయనగరం జిల్లాకు చెందిందే. అయినా అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండల పరిధిలోని రైవాడ గ్రామం వద్ద రైవాడ జలాశయాన్ని 2005లో నిర్మించారు. దానికి ద్వారా వేపాడ మండల రైతులకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. కొంతకాలం విశాఖపట్నం ప్రజలకు తాగునీటి కోసం ఈ జలాశయం నీటిని వాడుకుంటామని చెప్పారు. ఏలేరు కాలువ పనులు పూర్తి కాగానే రైవాడ రిజర్వాయర్ నీటిని శృంగవరపుకోట నియోజకవర్గంలోని ఐదు మండలాల రైతులకు అందిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇంత వరకూ రైవాడ రిజర్వాయర్ నుంచి సాగునీటిని వేపాడ మండలానికే కాదు, శృంగవరపుకోట నియోజకవర్గానికీ అందించలేదు. దీంతో 25 ఏళ్లుగా రైతులు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు.

రైవాడ రిజర్వాయర్ నుంచి విశాఖకు చెందిన మేఘాద్రి గెడ్డకు నీటిని తరలించేందుకు వేపాడ మండలానికి చెందిన కడకొండ, వావిలపాడు, నల్లబెల్లి, చిన్నగుడిపాల, నీలకంఠరాజపుర అగ్రహారం, బల్లంకి, ఎకెజిపాలెం, కెఆర్ఎఫ్ పేట గ్రామ రెవెన్యూ పరిధిలోని జిరాయతీ భూముల్లో నుంచి కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ కాలువ నిర్మాణానికి భూములు ఇస్తే సాగునీరందిస్తామని చెప్పారు. కానీ చుక్క నీటిని కూడా ఇవ్వలేదు. ఒకానొక దశలో బల్లంకి గ్రామస్తులు తమ గ్రామానికి ఆనుకుని ఉన్న చెరువు నుంచి కాలువ వరకు సుమారు ఆరు కిలోమీటర్లు సొంతంగా కాలువ చదును చేసుకున్నారు. ఆ కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తే సుమారు 30 గ్రామాల వరకు సాగునీరు అందే అవకాశం ఉందని చెప్పి పోరాటం చేశారు. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకుండా కాలువ ద్వారా నీటిని విడుదల చేయలేదు.

ఎన్నో పోరాటాలు

రైవాడ రిజర్వాయరు నీటిని రైతులకు ఇవ్వాలని పలుమార్లు రైవాడ రైతుల నీటి సంఘం నాయకుడు వేచలపు వెంకట చినరామునాయుడు ఆధ్వర్యంలో పోరాటం సాగించారు. ధర్నాలు చేసే సమయంలో విశాఖపట్నం, విజయనగరం జిల్లాలకు చెందిన అధికారులు వచ్చి తప్పనిసరిగా రైవాడ కాలువ నీటిని రైతులకు అందజేస్తామని చెప్పి వెళ్లిపోయేవారు. అంతేతప్ప ఇంతవరకు రైతులకు సాగు, తాగునీరు అందించేందుకు ఎటువంటి చర్యలూ తీసుకోలేదు.

పార్టీలు మారినా.?

నియోజకవర్గంలో 25 ఏళ్ల కాలంలో మూడు పార్టీలు అధికారంలోకి వచ్చాయి. కానీ రైతుల సమస్యలను మాత్రం పరిష్కరించలేదు. ఎన్నికల ముందు మాత్రం రైతులకు ఉన్న సాగునీటి కష్టాలను తీర్చేస్తామని హామీలిచ్చి తరువాత వాటిని తుంగలో తొక్కుతున్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా కోళ్ల లలితకుమారి, ఒకసారి ఎమ్మెల్యేగా కడుబండి శ్రీనివాసరావు ఎన్నికైనా సమస్యలను మాత్రం పరిష్కరించలేకపోయారు. దీంతో రైతులు ప్రభుత్వాలు మారినా తమ సమస్య పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి శృంగవరపుకోట నియోజకవర్గ పరిధిలోని రైతులకు సాగు, తాగునీటిని రైవాడ రిజర్వాయర్ ద్వారా అందించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

సుందరయ్య స్ఫూర్తితో

ప్రజా పోరాటాలు ఉధృతం

పుచ్చలపల్లి వర్ధంతి సభలో సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి

సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కృష్ణమూర్తి, నాయకులు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్/టౌన్

పుచ్చలపల్లి సుందరయ్య బాటలో ప్రజాపోరాటాలు ఉధృతం చేస్తూ, ప్రజాసేవను ఆచరణలో పెట్టడమే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని తాన్నవలస, కొత్తవలస, పట్టణంలో సుందరయ్య భవనంలో, మూడో వార్డు వివేకానంద కాలనీలో సుందరయ్య వర్ధంతి సభలు, సమావేశాలు ఆదివారం జరిగాయి. తొలుత స్థానిక సుందరయ్య భవనంలో పట్టణ సిపిఎం కార్యదర్శి జి.వెంకటరమణ అధ్యక్షతన జరగ్గా, గంగాపురం పంచాయతీ తాన్నవలసలో సిపిఎం మండల కార్యదర్శి బంటు దాసు అధ్యక్షతన జరిగిన సభలో కృష్ణమూర్తి మాట్లాడారు. సుందరయ్య ఆశయాలు, కర్తవ్యాలు కష్టజీవులు, కార్మికులు, గిరిజనులకు, ప్రజలకు సేవ చేయడమేనన్నారు. కమ్యూనిస్టులు ప్రజల్లో కలిసిపోయే విధానాన్ని పార్టీలో ప్రారంభించిన ధీరోదాత్తుడు, ప్రజా సేవకుడు, పోరాటయోధుడు సుందరయ్య అని కొనియాడారు. విశాలాంధ్రలో ప్రజారాజ్యం నిర్మించాలన్న పట్టుదలతో అన్ని వర్గాలను కలుపుకొని ప్రజా ఉద్యమాల్ని సమైక్య, భాష ప్రయోక్త రాష్ట్రం ఏర్పాటుకు పనిచేశారన్నారు. ఇప్పటికీ సుందరయ్య బాటే ఆంధ్రరాష్ట్రానికి అనుసరణీయమన్నారు. దేశంలో ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమాన్ని, సిపిఎం నిర్మాణాన్ని చేపట్టారన్నారు. ప్రజలకు సేవ చేయటమే విప్లవకారులు వృత్తిగా ఉండాలని సుందరయ్య కోర్కె అని, దాన్ని మనమంతా అమలు చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తొలుత సుందరయ్య భవనంలో సిపిఎం జెండాను జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుందరయ్య దేశంలో, రాష్ట్రంలో పోరాడే ఎర్రజెండాను, పోరాట పంథాలు ప్రజలకు నేర్పారన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రజాపోరాటాలను ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు.

సుందరయ్య భవనంలో, రావికాన పంచాయతీ కొత్తవలస, పట్టణంలో వివేకానంద కాలనీలో సుందరయ్య ఫోటోకు పూలదండలు వేసి నివాళులర్పించి సుందరయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి కార్యకర్తలు ప్రతినపూనారు. కార్యక్రమాల్లో సిపిఎం పట్టణ, మండల నాయకులు బంకురు సూరిబాబు, రెడ్డి శ్రీదేవి, సంచాన ఉమా, కె.రామస్వామి, కృష్ణ, ప్రజాసంఘాల నాయకులు, లాయర్ ఎం.వెంకట్రావు, పి.రాము, వరలక్ష్మి, బాషా, జి సింహాచలం, లక్ష్మణరావు, బలరాం, బంటు ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

స్ఫూర్తి దాత సుందరయ్య

విజయనగరం టౌన్ : కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య పోరాట యోధులకు స్ఫూర్తి దాతని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు కొనియాడారు. ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా నగరంలోని రామకృష్ణ నగర్‌లో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమసమాజ నిర్మాణం కోసం సుందరయ్య చేసిన కృషి, పోరాటం అందరికీ ఆదర్శమన్నారు. దోపిడీకి వ్యతిరేకంగా, కార్మికులు, పేదల ప్రభుత్వం కోసం, అంతరాలు లేని సమాజం కోసం ఆయన చేసిన కృషి నేటి తరానికి ఆదర్శమన్నారు. ఆయన స్ఫూర్తితో దోపిడీ, అంతరాలు లేని సమాజం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు శాంతమూర్తి, జగదాంబ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

రామకృష్ణా నగర్‌లో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్డి శంకరరావు, తదితరులు

సుందరయ్య బాటలో నడుద్దాం

సుందరయ్య బాటలో సమసమాజం కోసం ఉద్యమించాలని సిపిఎం సీనియర్ నాయకులు ఎం.శ్రీనివాస కోరారు. సుందరయ్య వర్ధంతి సందర్భంగా స్థానిక ఎల్‌బిజి భవనంలో ఆయన చిత్రపటానికి శ్రీనివాస పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రెడ్డి శంకరరావు అధ్యక్షతన జరిగిన సభలో శ్రీనివాస మాట్లాడుతూ దేశంలో నేడు దుర్మార్గమైన మోడీ పాలన సాగుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. ఓట్లు లేని బిజెపి వెనుక రాష్ట్రంలోని వైసిపి, టిడిపి వెళ్తున్నాయంటే రాజకీయాలు ఎంత దారుణంగా ఉన్నాయో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. దోపిడీ వర్గాల చేతుల్లో పాలన ఉందని చెప్పారు. ప్రజలను ఐక్యం కాకుండా మతం, కులాలు పేరుతో విభజించి దోపిడీ శక్తులకు పాలన అప్పగించాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. పోరాడి సాధించుకున్న హక్కులు కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవడం కోసం, సామాజిక అంతరాలు లేని సమాజం కోసం సుందరయ్య స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ముందుగా ఎల్‌బిజి భవనంపై సిపిఎం జెండాను నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎ.జగన్మోహన్, బి.రమణ, రామ్మోహన్, యుఎస్ రవికుమార్, త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసేలా ప్రవీణ్ ప్రకాశ్ వైఖరి

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహనరావు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ వైఖరి ఉపాధ్యాయుల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసేలా ఉందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యా వ్యవస్థను బాగు చేసేలా చర్యలు తీసుకోవాలే తప్ప ఉపాధ్యాయులను వేధించడం, సమాజం దగ్గర చులకన చేయడం ప్రతిసారీ జీతాలు గురించి మాట్లాడడం సరికాదన్నారు. విద్యావ్యవస్థ బాగు చేయాలంటే ఉపాధ్యాయులు, సమాజం, తల్లిదండ్రులు ముఖ్యంగా ప్రభుత్వం బాధ్యత వహించాలి, అంతేగాని ఉపాధ్యాయులపై నెట్టడం సరికాదన్నారు. ఇప్పటికైనా ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి మెరుగైన, నాణ్యమైన విద్య కోసం ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రభుత్వ బడులు రక్షణకు సమాజాన్ని చైతన్యపర్చాలన్నారు. ఇప్పటికైనా ఉపాధ్యాయుల జీతాల కోసం మాట్లాడడం తగ్గించాలని, లేనిచో మీ జీతాల కోసం, మీ సౌకర్యాల కోసం కూడా మాట్లాడాల్సి వస్తుందని అన్నారు.

పోస్టల్ బ్యాలెట్ల తరలింపుపై అనుమానం

ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తాం : టిడిపి ఎమ్‌పి, ఎమ్మెల్యే అభ్యర్థులు కలిశెట్టి, అదితి

ప్రజాశక్తి-విజయనగరంకోట

పోస్టల్ బ్యాలెట్ల తరలింపు వ్యవహారంపై అనుమానాలు వ్యక్తమవతున్నాయని, అధికారుల తీరే అందుకు బలాన్నిస్తోందని టిడిపి విజయనగరం ఎమ్‌పి, ఎమ్మెల్యే అభ్యర్థులు కలిశెట్టి అప్పలనాయుడు, అదితి గజపతిరాజు తెలిపారు. ఆదివారం స్థానిక అశోక్ బంగ్లాలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 16న వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి అల్లుడు ఈశ్వర్ కౌశిక్, ఎంపిపి మామిడి అప్పలనాయుడు ఆధ్వర్యాన పోస్టల్ బ్యాలెట్లను తరలించడంపై అధికారులు పొంతనలేని సమాధానాలు ఇస్తున్నారని తెలిపారు. అధికారులు అడ్డంగా దొరికిపోయి, పొంతన లేని సమాధానాలిస్తూ గందరగోళానికి గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తన తరపున మామిడి అప్పలనాయుడు, ఈశ్వర్ కౌశిక్ హాజరవుతారంటూ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల రాసినట్లు ఓ లేఖను చూపుతున్నారని, పోస్టల్ బ్యాలెట్లను తరలించిన రోజు ఎందుకు చూపలేదని అధికారులను ప్రశ్నించారు. కొత్తగా ఈ లేఖను సృష్టించలేదని నమ్మకం ఏమిటి? అని నిలదీశారు. వైసిపికి తప్ప మిగతా పార్టీల అభ్యర్థులకు, స్వతంత్రులకు కనీస సమాచారం ఇవ్వలేదని మండిపడ్డారు. వీటన్నింటినీ పరిశీలిస్తే పోస్టల్ బ్యాలెట్ల తరలింపు, అధికారుల తీరుపై తమకు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు. ఈ విషయాలను మరోసారి ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, కార్యాలయ కార్యదర్శి రాజేష్‌బాబు, పట్టణ అధ్యక్షులు పి.లక్ష్మీవరప్రసాద్, మండల అధ్యక్షులు బి.నర్సింగరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి విజయనగరం ఎమ్‌పి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు

ఇసి చర్యలు తీసుకోవాలి

మాజీ ఎమ్మెల్యే గీత

పోస్టల్ బ్యాలెట్లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను నిబంధనలకు విరుద్ధంగా తెరిచిన అధికారులపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, స్వతంత్ర అభ్యర్థి మీసాల గీత.. ఎన్నికల సంఘాన్ని కోరారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి అల్లుడు కౌశిక్, విజయనగరం ఎంపిపి మామిడి అప్పలనాయుడు సమక్షంలో తెరవడాన్ని తీవ్రంగా పరిగణించి ఎన్నికల సంఘం అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్ట్రాంగ్‌రూమ్‌ను తెరవాలంటే ఎన్నిక ఆర్‌ఒ, ప్రధాన పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు సమాచారం ఇచ్చి వారి సమక్షంలోనే తెరవాల్సి ఉందని గుర్తుచేశారు. వైసిపి ఎమ్మెల్యే మనుషులు సెల్‌ఫోన్‌తోపాటుగా స్ట్రాంగ్ రూంలోకి వెళ్లి పోస్టల్ బ్యాలెట్ ఓట్లను తరలించడం పలు అనుమానాలకు తావిస్తోందని వ్యాఖ్యానించారు. వైసిపి నాయకులతో స్థానిక అధికారులు కుమ్మక్కై పోస్టల్ బ్యాలెట్లను తారుమారు చేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సంఘం వెంటనే స్పందించి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మూడో రోజుకు

జిందాల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-కొత్తవలస

జిందాల్ పరిశ్రమ వద్ద కార్మికుల నిరసన మూడో రోజు ఆదివారం కొనసాగింది. జిందాల్ యాజమాన్యం అర్థాంతరంగా లేఆఫ్ ప్రకటించడంపై కార్మికులు మండిపడుతున్నారు. ముందస్తు సమాచారం లేకుండా కంపెనీ యాజమాన్యం లేఆఫ్ ప్రకటించడాన్ని కార్మికులు తప్పు పడుతున్నారు. మూడో రోజు ఆదివారం జిందాల్ కర్మాగారం వద్ద కార్మికులు వంటా వార్పు కొనసాగించారు. నిరసన శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి సందర్శించారు. అండగా ఉంటామని, కార్మికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె భరోసానిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కోళ్ల అప్పల రాంప్రసాద్, తిక్కాన చిన్న దేవుడు, గోరపల్లి రాము, పిల్ల అప్పలరాజు, సలాది భీమయ్య, వైసిపి నాయకులు సింగంపల్లి గణేష్, కోనదేముడు, సిఐటియు నాయకులు గాడి అప్పారావు, నమ్మి చినబాబు, బొట్ట రాము, తదితరులు పాల్గొన్నారు.

నిరసన శిబిరంలో పాల్గొన్న కార్మికులు

చిరుత సంచారంతో ఆందోళన

ప్రజాశక్తి - భోగాపురం

తాజాగా బయటపడ్డ ముద్రలు

చిరుతపులి సంచరిస్తున్న సమాచారంతో ఆందోళన చెందుతుంటే అటవీశాఖ అధికారులు మాత్రం కనీసం పట్టించుకోవడం లేదని వివిధ గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు యువకులు చిరుతపులిని చూసి నట్లు చెబుతుండగా తాజాగా శనివారం అర్ధరాత్రి కూడా లారీ డ్రైవరుకు తారసపడడంతో మరింత ఆందోళన వ్యక్తమవు తోంది. అయిన ప్పటికీ అధికా రులు అవి చిరుత గుర్తులు కాదు.. హైనా గుర్తులని తేల్చేయ డంతో అధికారుల నిర్లక్ష్యం బట్ట బయలవుతోంది.

మండలంలోని చేపలకంచేరు పంచాయతీ దిబ్బలపాలెం వెళ్ళే రహదారిలో వారం రోజులు కిందట అర్ధరాత్రి వేళ అదే గ్రామానికి చెందిన రాము అనే వ్యక్తికి చిరుత పులి కనబడింది. ఆ మరుసటి రోజు ఉదయం అదే గ్రామానికి చెందిన ధన అనే బాలుడు పాఠశాల వద్దకు వెళ్లగా సమీపంలోని ఒక దిబ్బపై కనబడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దిబ్బలపాలెం రహదారి నుంచి కవులవాడ వెళ్లే రహదారిలో పులితో పాటు మరో పిల్ల పులికి సంబంధించిన పాద ముద్ర లు గ్రామస్తులు గుర్తించారు. దీంతో గతవారం రోజులు నుంచి వీరంతా ఆందోళన చెందుతున్నారు.

అర్ధరాత్రి వేళ లారీ డ్రైవరుకు తారసపడిన పులి

కాగితాల రాణా అనే లారీ డ్రైవరు నిత్యం రాత్రి వేళలో కవులవాడ సమీపంలో ఒక రియల్ ఎస్టేట్ సంస్థకు రాయి, పిక్కను లారీలో తరలిస్తుంటారు. శనివారం అర్ధరాత్రి దిబ్బలపాలెం రహదారిలోని ఒక రిసార్ట్ ప్రహరీ గోడకు ఆనుకొని చిరుత పులి పిల్ల వెళ్తుండడం చూసాడు. లారీ లైట్లు వెళుతురుకు రిసార్ట్ గేటులో నుంచి లోపలకు పారిపోయిందని చెబుతున్నాడు. ఈ విషయాన్ని గ్రామస్తులకు చేరవేశాడు. దీంతో గ్రామదేవతల పండగలో ఉన్న గ్రామస్తులు ఈ విషయం తెలుసుకొని మరింత ఆందోళన చెందుతున్నారు. అంతేకాక గ్రామానికి సమీపంలో ఇసుక దిబ్బల్లో పాదముద్రలు కూడా మళ్లీ స్పష్టంగా కనిపిస్తున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు.

అటవీశాఖ అధికారుల తీరుపై ఆగ్రహం

వారం రోజులు నుంచి చిరుతపులి సంచరిస్తుందని తెలిసినప్పటికి అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని వివిధ గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చూసిన వ్యక్తులు అది చిరుత పులి అని చెబుతుంటే అధికారులు మాత్రం పులికాదని అనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఏది ఏమైనా కనీసం గ్రామాల్లోకి వచ్చి సూచనలు, సలహాలు ఇవ్వడం లేదని సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే అసలు విషయం బయటపడుతుందని చెబుతున్నారు. అధికారులు చొరవ చూపకపోతే పండగ తరువాత తామంతా రోడ్డెక్కి నిరసన తెలియజేస్తామని హెచ్చరిస్తున్నారు.

ఇంటి దొంగల ముప్పు

- టిడిపి, వైసిపిల్లో కోవర్ట్ ఆపరేషన్‌పై చర్చ
- ఎవరి కొంప ముంచుతుందోనన్న భయం

ప్రజాశక్తి - సాలూరు

ఈసారి ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలు రెండింటికీ ఇంటి దొంగల ముప్పు పొంచి ఉందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఒక పార్టీలో కీలక నాయకుడిగా కొనసాగుతూ ప్రత్యర్థి పార్టీకి సహకరించడం, కీలక సమాచారాన్ని చేరవేయడం వంటి అంశాలు ఈ ఎన్నికల్లో కీలకపాత్ర పోషించాయని తెలుస్తోంది. నియోజకవర్గంలో టిడిపి, వైసిపి అభ్యర్థులిద్దరూ ఇంటి దొంగల ముప్పును ఎదుర్కొన్నారనే ప్రచారం జరుగుతోంది. ఒకప్పుడు రాజకీయాల్లో ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు వారున్న పార్టీ అభ్యర్థి విజయం కోసం చిత్తశుద్ధితో పని చేసేవారు. అయితే గత కొంతకాలంగా ఇంటి దొంగల చేతివాటం ప్రధాన రాజకీయ పార్టీలను వెంటాడుతోంది. ఇంటి దొంగలను ఈశ్వరుడైనా కనిపెట్టలేడన్న చందంగా కొంతమంది నాయకులు కోవర్ట్ ఆపరేషన్లను అమలు చేస్తున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి సంధ్యారాణి, వైసిపి అభ్యర్థి రాజన్నదొరలిద్దరూ ఇంటి దొంగల బెడదను ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ విధంగా టిడిపికి చెందిన కొంతమంది నాయకులు వైసిపితో కుమ్మక్కై సహకరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి వారు క్విడ్ ప్రోకో పద్ధతిలో డబ్బులు అందుకున్నారనే ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గ పరిధిలో ఉన్న మున్సిపాలిటీ, నాలుగు మండలాలకు చెందిన కొంతమంది నాయకులు కోవర్ట్ ఆపరేషన్ చేసినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. అదే విధంగా వైసిపికి చెందిన కొంతమంది నాయకులు కూడా టిడిపికి లోపాయికారీ సహకారం అందించారనే చర్చ నడుస్తోంది. ఒకటి, రెండు మండలాలు, పట్టణానికి చెందిన నాయకులు టిడిపితో లాలూచీ పడినట్లు అధికారపార్టీ శ్రేణుల్లో గుసగుసలు మొదలయ్యాయి. పోలింగ్ ముగియడంతో ఓట్ల లెక్కింపు కోసం ప్రధాన అభ్యర్థులు ఎదురు చూస్తున్నారు. ఎక్కడ ఆధిక్యత వస్తుందనే అంచనాల్లో అభ్యర్థులు మునిగి తేలుతున్నారు. ఒకటికి రెండు సార్లు పార్టీ నాయకులు, కార్యకర్తల పనితీరు, ప్రవర్తనలను అంచనా వేసుకుని ఫలితం ఎలా వుండబోతుందని పోస్ట్ మార్టం జరుపుకుంటున్న కనిపిస్తోంది. ఈ దఫా ఎన్నికల్లో ఒక ప్రధాన పార్టీకి చెందిన కొంతమంది కౌన్సిలర్లు, నాయకులు పట్టణంలో సరిగ్గా ఓటర్లకు డబ్బులు పంపిణీ చేయకపోవడంపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు గుసగుసలాడుకుంటున్నారు. దీనిపై ఆ పార్టీ అభ్యర్థి కూడా ఆరా తీస్తున్నట్లు సమాచారం. ప్రత్యర్థి పార్టీ నాయకులు, కార్యకర్తలను ప్రలోభాలకు గురి చేసి లబ్ధి పొందాలనే వ్యూహ, ప్రతివ్యూహాలతో టిడిపి, వైసిపి అభ్యర్థులు ఇద్దరూ ' ఆపరేషన్ ఆకర్ష్' నిర్వహించారనేది స్పష్టంగా కనిపిస్తోంది. అయితే ఈ వ్యవహారంలో ఎవరి ఆపరేషన్ సక్సెస్ అవుతుందో, ఎవరి వ్యూహం ఫలిస్తుందో ఇప్పుడే చెప్పడం కష్టం. కానీ పోటీలో ఉన్న అభ్యర్థులు మాత్రం వారి గత అనుభవాన్ని బట్టి ఆ నష్టం ఏమేరకు వుంటుందనేది అంచనా వేస్తున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రకటించిన మేనిఫెస్టోలు, గతంలో అవి అధికారంలో ఉన్నప్పుడు అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజల విశ్వసనీయత కొంతవరకు ఓట్లు రాబడితే ఎత్తు కు పైఎత్తులు, వ్యూహ, ప్రతివ్యూహాల వల్ల కొంత మేలు జరుగుతుందని అభ్యర్థులు భావిస్తున్నారు. దీంతో నియోజకవర్గ ఎన్నికల్లో వైసిపి, టిడిపి అభ్యర్థులిద్దరూ కోవర్ట్ ఆపరేషన్లను ప్రోత్సహించారనేది బహిరంగ రహస్యం. అయితే ఆ ఆపరేషన్లు ఎవరి కొంప ముంచుతాయనేది తేలాలంటే జూన్ 4వరకు ఆగాల్సిందే.

జెఇఇ మెయిన్స్‌లో ప్రవీణ్‌కు 19వ ర్యాంకు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఇఇ మెయిన్స్ పార్టు-బికి సంబంధించి బి-ప్లానింగ్‌లో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో విజయనగరానికి చెందిన తొత్తడి ప్రవీణ్ 19వ ర్యాంకు సాధించాడు. ఒబిసి కేటగిరీలో ఐదో ర్యాంకు పొందాడు. బి.ఆర్క్‌లో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 37వ ర్యాంకు, ఒబిసి కేటగిరీలో 11వ ర్యాంకు సాధించాడు. ప్రవీణ్ విశాఖలోని ప్రయివేటు కళాశాలలో ఇంటర్ విద్యనభ్యసించాడు.

ఎయిడ్స్ బాధితులకు అండగా ఉంటామని

కొవ్వొత్తులతో మౌన ప్రదర్శన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్రపంచ వ్యాప్తంగా హెచ్ఐవి, ఎయిడ్స్ వల్ల మరణించిన బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇస్తూ జిల్లా ఎయిడ్స్ నివారణా సంస్థ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యాన పట్టణంలో ఆదివారంకొవ్వొత్తులతో మౌన ప్రదర్శన నిర్వహించారు. హెచ్.ఐ.వి/ఎయిడ్స్‌తో చనిపోయినవారిని గుర్తు చేసుకుంటూ వారి పట్ల ప్రేమ, సంఘీభావం తెలియజేద్దాం, వారి కుటుంబ సభ్యుల భాదను నయం చేద్దాం" అంటూ స్థానిక ఎన్‌జిఒ హోం నుంచి మౌన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రాణాధికారి డాక్టర్ ఎం.వినోద్ మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాధిగ్రస్తులందరికీ మెరుగైన వైద్య సేవలందుతున్నాయని, వీటిని వినియోగించుకోవాలని, కోరారు. సి డి4 కౌంట్ మిషన్ జిల్లా ఆసుపత్రి పార్వతీపురంలో అందుబాటులో ఉందని, ప్రజల్లో హెచ్ఐవి వ్యాధి పట్ల అవగాహన పెరిగిందని తెలిపారు. ఎపిడమియాలజిస్ట్ డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ హెచ్ఐవి పట్ల జాగ్రత్తగా వహించాలని, తప్పక పరీక్షలు చేసుకోవాలని అన్నారు. జిల్లా పర్యవేక్షకుడు ఎన్.సాక్షి గోపాలరావు మాట్లాడుతూ హెచ్ఐవి వచ్చే అన్ని మార్గాలను ఆపి వేయాలని, ప్రజలంతా అవగాహనతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, విజయ పాజిటివ్ నెట్ వర్కు వారి సిబ్బంది, పాజిటివ్ నెట్వర్కు., వైడిఒ స్వచ్ఛంద సంస్థ, లింకు వర్కర్లు (చైల్డ్ పండ ఇండియా), వైఆర్‌జి కేర్, ఐసిటిసి/ఎఆర్‌టి//డిఎస్ఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగుపడి గొర్రెల కాపరి మృతి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని వెంకటరమణపేట గ్రామానికి చెందిన గొర్రెల కాపరి బొబ్బిలి అప్పలస్వామి (25) ఆదివారం పిడుగు పడి మృతి చెందాడు. ఎస్ఐ గంగరాజు కథనం ప్రకారం.. బొబ్బిలి అప్పలస్వామి ఎప్పటిలాగే గొర్రెలను తోలుకొని గ్రామ సమీపంలో ఉన్న కంచిపాటి రాము క్వారీ వద్ద గల మెట్టకు తీసుకువెళ్లాడు. సాయంత్రానికి గొర్రెలు ఇంటికి వచ్చాయి గాని అప్పలస్వామి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు మెట్ట ప్రాంతానికి వెళ్లి వెతకగా అప్పలస్వామి పిడుగుపాటుకు గురై మరణించి ఉన్నాడు. అప్పలస్వామికి తల్లిదండ్రులు, భార్య, ఏడాది కుమారుడు ఉన్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ప్రథమ బహుమతిని అందిస్తున్న టిడిపి నాయకులు

క్రీడలతోనే మానసికోల్లాసం

ప్రజాశక్తి - రామభద్రపురం

క్రీడలతోనే మానసికోల్లాసం సాధ్యపడుతుందని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతినాయుడు అన్నారు. మండలంలోని బూసాయవలస గ్రామంలో దివంగత మడక శ్రీదేవి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల పట్ల కూడా ప్రావీణ్యం పొందాలన్నారు. క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో కూడా ప్రాధాన్యత ఉంటుందన్నారు. అనంతరం ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిన ఎనుబరువు గిరిజన క్రికెట్ జట్టుకు ప్రథమ బహుమతిగా రూ.15వేలు, పాతబొబ్బిలి జట్టుకు ద్వితీయ బహుమతిగా రూ.10వేలు షీల్డులు ప్రదానం చేశారు. వ్యక్తిగతంగా 63 పరుగులు సాధించిన ఆడారి ప్రవీణ్ కుమార్‌కు ప్రత్యేక బహుమతిని అందించారు. గిరిపుత్రులు క్రికెట్ టోర్నమెంట్‌లో ఎంతో ప్రతిభ చూపడంతో ముగ్ధులైన టిడిపి జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు కర్రోతు తిరుపతిరావు ప్రత్యేకంగా రూ.5 వేల నగదు బహుమతిని ఎనుబరువు క్రికెట్ జట్టుకు అందించారు. ఈ టోర్నమెంట్‌కు ఎంపైర్లుగా యాండ్రపు హరి, సంతోష వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి, సాలూరు, రామభద్రపురం, బాడంగి మండలాలకు చెందిన క్రికెట్ జట్లతోపాటు, క్రికెట్ క్రీడాకారులు, యాండ్రాపు భాను, మడక పాపారావు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై దాడిని ఖండించండి

ప్రజాశక్తి- బొబ్బిలి

గజపతినగరం మండలం శ్రీరంగరాజపురంలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయునిపై దాడిని ఖండించాలని పిఆర్‌టియు జిల్లా నాయకులు వి.తవిటినాయుడు, సత్యనారాయణ, అప్పలనాయుడు కోరారు. దాడిలో గాయపడిన ఉపాధ్యాయుడు వాసిరెడ్డి రాంబాబును ఆదివారం పరామర్శించారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న రాంబాబుపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. దాడిని ప్రజలు, ఉద్యోగులు ఖండించాలని, అక్రమ కేసును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

ఊరటనిచ్చిన వర్షం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో సింగరాయి, ఎఎస్‌పేట, జగ్గయ్యపేట, అరిగిపాలెం, సోంపురం గ్రామాలలో ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షం ఊరటనిచ్చింది. గత మూడు రోజులుగా కాస్తున్న ఎండలకు ఈ వర్షంతో ప్రజలు ఉపసమనం పొందారు.

బూరాడ వార్డు సభ్యులు మృతి

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని బూరాడ గ్రామపంచాయతీ 10వ వార్డు మెంబర్ గులివిందల అంజమ్మ (55) అనారోగ్యంతో మృతి చెందారు. ఈమె మృతికి వైస్ ఎంపిపి వావిలపల్లి జగన్మోహన్‌రావు, సర్పంచ్ వావిలపల్లి శశిభూషణరావు, సోషల్ మీడియా కన్వీనర్ మజ్జి శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు సంతాపం తెలిపారు.

రోడ్డు పనులు అడ్డగింత

పార్వతీపురంరూరల్ : మండలంలోని డోకిశిల పంచాయితీ తేలునాయుడు వలస రెవెన్యూ పరిధిలోని గిరిజనులు సాగు చేసుకుంటున్న భూముల మధ్యలో చేపట్టిన రహదారి పనులను ఎపి రైతుసంఘం మండల నాయకులు పి.రాము ఆధ్వర్యంలో గిరిజనులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎటువంటి ప్రభుత్వ అనుమతుల్లేకుండా, గిరిజన గ్రామాలకు ఉపయోగంలేని రోడ్డు నిర్మాణం పేరిట వెలగవలసకు చెందిన కె.సన్యాసిబాబు పనులు చేయిస్తున్నారని అన్నారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను ధ్వంసం చేయడమేనన్నారు. దీన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా మని తెలిపారు. ఈ పనులపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమయపాలన పాటించని సిబ్బంది

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక డాక్టర్ సన్యాసిరాజు మున్సిపల్ పార్క్, ఆ పక్కనే ఉన్న మున్సిపల్ గ్రంథాలయ సిబ్బంది ఆదివారం సమయ పాలన పాటించ కుండా మధ్యాహ్నం 12 గంటలకే గేట్లను మూసి తాళం వేసి వెళ్లిపోయారు. దీంతో గ్రంథాలయంలో ఉండే పాఠకులు, పార్కులో ఆహ్లాదం, సేద తీర్చుకునేందుకు వచ్చిన పర్యాటకులు సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేశారు. సిబ్బంది విధులను సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడడం వల్లే ఎవరికి నచ్చిన విధంగా వారు ప్రవర్తిస్తున్నారని స్థానికులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు.

కోటదర్గమ్మను దర్శించుకున్న ఎఎస్‌పి

ప్రజాశక్తి -పాలకొండ

కోటదుర్గ అమ్మవారిని మన్యం జిల్లా అదనపు ఎస్పీ దిలీప్ కుమార్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మి ప్రసాద్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందితో మాట్లాడి ఎన్నికల తర్వాత పరిస్థితులు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డిఎస్‌పి జివి కృష్ణారావు, సిఐ చంద్రమౌళి, ఎస్సై ప్రశాంత్ కుమార్ ఉన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- బొబ్బిలి

మండలంలోని మెట్టవలస సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఇందిరమ్మ కాలనీకు చెందిన ఎ.వెంకటేష్ ద్విచక్ర వాహనంపై బొబ్బిలి నుంచి రామభద్రపురం వెళుతుండగా విజయనగరం నుంచి బొబ్బిలి వస్తున్న మ్యాక్సీ క్యాబ్ ఢీకొనడంతో వెంకటేష్ తీవ్రంగా గాయపడగా మ్యాక్సీ క్యాబ్ లో ఉన్న ఇ.గురునాథరావు తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం విజయనగరం సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఏఎస్ఐ భాస్కరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేదల పక్షపాతి సుందరయ్య

ప్రజాశక్తి- బొబ్బిలి

పేదల పక్షపాతి పుచ్చలపల్లి సుందరయ్య అని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు అన్నారు. శ్రీవేణుగోపాల స్వామి ఆలయం జంక్షన్‌లో సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, కష్టజీవులు పక్షాన పుచ్చలపల్లి సుందరయ్య పని చేశారన్నారు. కుల వివక్షకు వ్యతిరేకంగా, వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని కష్ట జీవులు పక్షాన నిలబడి పోరాటం చేశారన్నారు. తెలుగు ప్రజలకు ఒక రాష్ట్రం కావాలని కోరుతూ భాషా సంయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేయాలని పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఎం సభ్యులు జె.రామారావు, జి.వాసు, బి.వెంకటి, కార్మికులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పుచ్చలపల్లి సుందరయ్య అని యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో, ప్రజా సంఘాల కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి సభ నిర్వహించారు. సుందరయ్య జీవిత చరిత్రను నేటి రాజకీయ పార్టీల నాయకులు ఆదర్శంగా తీసుకుని ప్రజా సమస్యలు పరిష్కారానికి పని చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, అంగన్వాడీ యూనియన్ నాయకులు కామేశ్వరి, తదితరులు పాల్గొన్నారు. రెడ్డికవీధిలో సిపిఎం ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతి సభ నిర్వహించారు.

విజయనగరం: సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నెల్లిమర్ల: సిపిఎం నిర్మాణ కర్త స్వర్గీయ పుచ్చల పల్లి సుందరయ్య ఆదర్శ నీయులని సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు కొనియాడారు. ఆదివారం సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన నెల్లిమర్లలో విలేకర్లతో మాట్లాడారు. పార్టీ నిర్మాణం కోసం అహర్నిశలు శ్రమించి కమ్యునిస్టు పార్టీని ప్రజల్లోకి తీసుకు వెళ్లారని, వివక్ష లేని సమాజమే లక్ష్యంగా పోరాటాలు చేశారని గుర్తు చేశారు అటువంటి వ్యక్తిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

డెంకాడ: మండలంలోని అక్కివరం హేచరీ వద్ద ఆదివారం సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు బి.సూర్యనారాయణ మాట్లాడుతూ దక్షిణ భారత దేశంలో కమ్యూనిస్టు పార్టీ స్థాపించిన వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని గుర్తు చేశారు. సుందరయ్య పూర్తి పేరు వెంకట సుందరరామిరెడ్డి అని కులవ్యవస్థను నిరసిస్తూ ఆయన పేరు చివరన ఉన్న రెడ్డి తొలగించుకొని పుచ్చలపల్లి సుందరయ్యగా పేరు మార్చుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

కొత్తవలస: స్థానిక జిందాల్ పరిశ్రమ వద్ద, సిపిఎం కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సిపిఎం నాయకులు గాడి అప్పారావు, కార్మిక నాయకులు నమ్మి చినబాబు, బట్ట రాము, బాలిబోయిన ఈశ్వరరావు, సలాది భీమయ్య, పిల్ల అప్పలరాజు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే కులవివక్షకు వ్యతిరేకంగా కుటుంబాన్ని వ్యతిరేకించిన వ్యక్తి సుందరయ్య అన్నారు. సమ సమాజ నిర్మాణం కోసం ఆయన చేసిన కృషి, పోరాటం అందరికీ ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, సంఘాల నేతలు పాల్గొన్నారు..

గజపతినగరం: సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జయంతి కాలనీలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని నిర్వహించారు. ముందుగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు జి శ్రీనివాస్, సిఐటియు నాయకులు కనకరాజు పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం లక్ష్మీ, శ్రీనివాస్ మాట్లాడుతూ దక్షిణ భారత దేశ కమ్యూనిస్టు ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీను, కోటి, ఏసు, భాస్కరరావు, దన్నాన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ: మండలంలోని గుర్ల గ్రామంలో సిపిఎం నాయకులు రాకోటి రాములు ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు.

బొబ్బిలి: సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

డెంకాడ: సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

గజపతినగరం: సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేస్తున్న నాయకులు

ఎమ్‌పిగా పట్టం ఎవరికో..!

- విజయనగరం ఎమ్‌పి స్థానంపై ఎవరి ధీమా వారిదే
- మరోసారి తామే గెలుస్తామని వైసిపి
- మోడీ మంత్రం పనిచేస్తుందంటున్న టిడిపి
- ఉత్కంఠ రేపుతున్న ఫలితం

ప్రజాశక్తి- చీపురుపల్లి

పార్లమెంటు ఎన్నికలలో గెలుపుపై అటు వైసిపి ఇటు టిడిపి పార్టీలు ధీమాగా ఉన్నాయి. 2019లో రాష్ట్రంలో 25 పార్లమెంటు స్థానాలలో ఏకంగా 22 స్థానాలను కైవసం చేసుకొని మంచి ఉత్సాహంతో ఈ సారీ కూడా తమదే గెలుపు అనే ధీమాతో వైసిపి భావిస్తోంది. ఈ ఐదేళ్ల తాము చేసినన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఏ రాష్ట్రంలోనూ చేయలేదని, అభివృద్ధి అంటూ జరిగిందంటే తమ హయాంలోనే జరిగిందని వైసిపి ప్రచారం చేసుకుంటూ పోయింది. అధికారం కోల్పోయి ఐదేళ్ల గడిచిన సందర్భంగా అధికార పార్టీ వైఫల్యాలను ఎండ గడుతూ జగన్ పాలనలో రాష్ట్రం అదోగతి పాలైందంటూ ప్రతిపక్ష పార్టీలైన టిడిపి, జనసేన పార్టీలు విమర్శనాస్త్రాలు సంధిస్తూ వైసిపిపై తిరుగుబాటు చేసి ప్రజలను తమ వైపు తిప్పుకునేందుకు సర్వశక్తులు ఒడ్డాయి. దీనికి తోడు కేంద్రంలో ఉన్న బిజెపిని కలుపుకొని కూటమిగా ఏర్పడి రాష్ట్రంలో అధికారం తమకిస్తే ప్రజలకు సంక్షేమంతో పాటు అభివృద్ధి చేస్తామని టిడిపి కూటమి ప్రచారాన్ని ఉధృతం చేసింది. ఈ రెండు పార్టీలు ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు రాజకీయ ఎత్తుగడలు వేస్తూ ప్రచారాన్ని హోరెత్తించాయి. ఈ నేపథ్యంలో ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపారనే విషయమై ఉత్కంఠ నెలకొంది.



విజయనగరం పార్లమెంటు వైసిపి అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ 2019లో సుమారు 44 వేల మెజార్టీతో టిడిపి అభ్యర్థి పూసపాటి అశోకగజపతిరాజుపై గెలుపొందారు. అయితే పార్లమెంటుకు గెలిచిన అభ్యర్థులెవరూ నియోజకవర్గంలోని ప్రజలను పట్టించుకోలేదని తాను గెలిచినప్పటి నుంచి ప్రజలలోనే నిరంతరం ఉంటూ విజయనగరం పార్లమెంటు నియోజకవర్గంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధికి కృషి చేసానని ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ తన ప్రచారంలో ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. చంద్రబాబునాయుడి ఆశీస్సులతో తాను ఎంపిగా పోటీ చేస్తున్నానని, టిడిపి అధికారంలోనికి వస్తే చేపట్టబోయో సంక్షేమ పథకాలు, అభివృద్దిని చెబుతూ టిడిపి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు ప్రజలలో విస్తారంగా ప్రచారం నిర్వహించాడు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వస్తుందని తద్వారా విజయనగరం పార్లమెంటు అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుందని కలిశెట్టి ముమ్మర ప్రచారం చేస్తూ ఓటర్లను తమ వైపు తిప్పుకునేందు సర్వశక్తులూ ఒడ్డారు.

విజయనగరం పార్లమెంటు నియోజకవర్గంలో రాజాం, బొబ్బిలి, చీపురుపల్లి, గజపతినగరం, విజయనగరం, నెల్లిమర్ల నియోజక వర్గాలతో పాటు శ్రీకాకుళం జిల్లాలో ఉన్న ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజక వర్గాలు కలుపుకొని ఏడు నియోజక వర్గాలున్నాయి. ఈ ఏడు నియోజక వర్గాలలో మొత్తం ఓటర్లు 15,67,039 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 7,85,642 మంది, మహిళా ఓటర్లు 7,81,373 మంది ఉన్నారు. 12,84,876 మంది తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 6,36,609 మంది కాగా 6,48,267 మంది మహిళా ఓటర్లు తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. అయితే పార్లమెంటు పరిధిలో కూడా మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరంతా ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలకు ఆకర్షితులై ఓటు తమకే వేశారని వైసిపి వర్గాలు చెబుతుండగా, చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు నచ్చి తమకే ఓటు వేశారని కూటమి నాయకులు అంచనా వేసుకుంటున్నారు. అయితే ఈ సారి ఎవరికి పట్టం కట్టారో జూన్ నాలుగు వరకూ వేచి చూడాల్సిందే.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని కెల్ల గ్రామంలో ఈ నెల 20వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరగనున్న గ్రామ దేవత అసిరితల్లి పండగ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని డిఎస్‌పి చక్రవర్తి కోరారు. పండగలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ఉత్సవ కమిటీతో ఆయన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూడాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఎన్నికల కోడ్ అమలలో ఉన్నందున అందరూ సంయమనం పాటించి ప్రశాంత వాతావరణంలో పండగ నిర్వహించుకోవాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించి విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇరు వర్గాలపై బైండోవర్ నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిఐ షణ్ముఖరావు, ఎస్ఐ భాస్కర్ రావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గుర్ల: మాట్లాడుతున్న డిఎస్‌పి చక్రవర్తి

పండగలు ప్రశాంతంగా నిర్వహించాలి

బొబ్బిలి: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున గొల్లపల్లి శ్రీదాడితల్లి, పాతబొబ్బిలి శ్రీసరేపొలమ్మతల్లి గ్రామదేవత పండగలు ప్రశాంతంగా నిర్వహించాలని డిఎస్‌పి శ్రీనివాసరావు తెలిపారు. ఉత్సవ కమిటీతో ఆయన ఆదివారం సమావేశం నిర్వహించారు. పండుగ సందర్భంగా డిజె సౌండ్ బాక్సులు, డాన్స్ బేబి డాన్స్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పండగ ప్రశాంతంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలకు ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు చిన్నారులతో కోలాటం

పాతబొబ్బిలి శ్రీసరేపొలమ్మతల్లి గ్రామదేవత పండగ సందర్భంగా సోమవారం సాయంత్రం పల్లివీధిలో ఉన్న అమ్మవారి అంగడి గుడి వద్ద చిన్నారులతో కోలాటం నిర్వహించనున్నట్లు యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షులు ఎం.విజయమోహన్ చెప్పారు. ఆనందోబ్రహ్మ కళాకారుల బృందం చిన్నారులతో కోలాటం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ అనుమతులు ఇచ్చినట్లు చెప్పారు. కోలాటాన్ని తిలకించి జయప్రదం చేయాలని కోరారు.

జోరుగా బెట్టింగులు

ప్రజాశక్తి- రేగిడి

సార్వత్రిక ఎన్నికలు పూర్తయిన అనంతరం ఎన్నికల ఫలితాలపై నియోజకవర్గంలో జోరుగా పందేలు జరుగుతున్నాయి. అభ్యర్థుల భవిత్వం ఇవిఎంలో భద్రంగా ఉండడంతో మరో 15 రోజుల్లో ఎక్కడ ఎవరు ఎమ్మెల్యే అనేది తేలనుంది. అంతలోనే నియోజకవర్గాల్లోనూ, మండల స్థాయిలో ఎక్కడ ఏ గ్రామంలో చూసిన బెట్టింగులు జోరుగా సాగుతున్నాయి. అభ్యర్థుల గెలుపు, ఓటములు మెజార్టీల పైన పందేలు జోరుగా కాస్తున్నారు. లక్షల్లో బెట్టింగ్ సాగుతుందని ప్రజల నుంచి దావాలంగా ప్రచారం జరుగుతోంది. మరోవైపు పలు పార్టీల నేతలు ఓటర్లను ఎప్పటికప్పుడు ఓటు ఎవరికి వేశారన్న దానిపై అంచనాలు వేస్తున్నారు. మరో 15 రోజుల్లో ఫలితాలు రానున్న సందర్భంగా అంతట ఉత్కంఠంగా నెలకొంది.

రోగికి రూ.15వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- బాడంగి

శృంగవరపుకోట మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన గొర్లె నారి బాబు డయాలసిస్‌తో బాధపడుతున్నాడని తెలుసుకుని ఆపరేషన్ నిమిత్తం గజరాయ నివలస ఎంపిటిసి, టిడిపి రాష్ట్ర ఎస్‌టి సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు రూ.15వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం రోగి గ్రామానికి వెళ్లి ఈ మొత్తాన్ని అందించారు. ఎరుకుల పాకలు గ్రామం నుంచి ఈ ఆర్థిక సాయం చేశామన్నారు.

బాధితునికి నగదు అందిస్తున్న గౌరు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 1992-1993 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల 33 మంది ఆదివారం ఒకేచోట కలిసి సందడి చేశారు. విశాఖపట్నంలో గల లార్వెన్ హోటల్ వేదికగా అపూర్వ కలయికను నిర్వహించి పాఠశాలలో వారి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరిని ఒకరు కలుసుకొని వారి వారి కుటుంబాల పరిస్థితులను, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ పాఠశాలలో విద్యను అభ్యసించిన రోజుల్లో గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. పాఠశాల స్థాయి విద్యను అభ్యసించిన రోజులు ఎంతో విలువైన రోజులని ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు తమ మనోభావాలను వ్యక్తపరిచారు. తమ సహ విద్యార్థులు ఎవరైనా అనారోగ్యంతో, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవు తుంటే వారికి అందరూ కలిసికట్టుగా ఆర్థిక సహాయం అందిస్తామని, అలానే పాఠశాల అభి వృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. 30 సంవత్సరాల తర్వాత ఈ పాఠశాలలో తమ తోటి విద్యార్థులను కలుసుకోవడం ఆనందంగా ఉంద న్నారు. అనంతరం తోటి స్నేహితులు ఆపదలో ఉన్న వారికి రూ.10 వేలు చొప్పున ఇద్దరికి ఆర్థిక సహాయం చేశారు.

ఒకేచోట కలిసిన పూర్వ విద్యార్థులు

ఎస్‌బిఐ ఖాతాదారుల సేవా కేంద్రంలో చోరీ

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల కేంద్రంలో గత 5 ఏళ్ళ నుంచి నిర్వహిస్తున్న ఎస్‌బిఐ సేవా కేంద్రంలో చోరీ జరిగింది. ఆదివారం కేంద్రం నిర్వాహకులు పివి సత్యారావు కేంద్రం తెరిచే సమయంలో చోరీ జరిగినట్లు గుర్తించి స్థానిక ఎస్ఐ జ్ఞాన ప్రసాద్‌కు సమాచారం అందించారు. వెంటనే ఎస్ఐ సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. జిల్లా కేంద్రం క్లూస్ టీమ్‌కు సమాచారం అందించారు. క్లూస్ టీమ్ వచ్చి పరిశీలించి చోరీ తీరుపై ఆదారాలు సేకరించారు. సుమారు రూ.1.66 లక్షలు నగదుతో పాటు లాప్ టాప్, రెండు కరెంట్ అకౌంట్ ఎటిఎం కార్డులు కూడా చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు సేవా కేంద్రం నిర్వాహకులు సత్యారావు తెలిపిన వివరాల మేరకు శనివారం మధ్యాహ్నం కేంద్రం క్లోజ్ చేసి బోజన విరామంకు వెళ్లామని, సాయంత్రం అనివార్య కారణాల వల్ల కేంద్రం తెరవలేకపోయామని అప్పటికే ఉన్న క్లోజింగ్ బ్యాలెన్స్ తోపాటు వేరే కేంద్రంకు ఇవ్వవలసిన మొత్తం రూ.40 వేలు కూడా చోరీ జరిగిందని తెలిపారు. షట్టర్ తెరువలేక గ్రిల్స్ తాళం పగలు కొట్టి లోనికి ప్రవేశించి లోపల తలుపులు తెరచి ప్రవేశించి చోరీ చేశారని వివరించారు. ఎటిఎం కార్డులు కూడా ఉపయోగించి నగదు తీసే ప్రయత్నం చేశారన్నారు. అయితే ఒక కార్డులో డబ్బు ఉన్నప్పటికీ పిన్ నెంబర్ ఇన్ కరెక్ట్ అవడం ఇంకో కార్డు పిన్ నెంబర్ కరెక్ట్ అయినప్పటికీ నగదు నిల్వలు లేకపోవడంతో వాటి నుంచి నగదు డ్రా అవ్వలేదన్నారు. వీటి ఆధారంగా దర్యాప్తు చేస్తే దుండగులు దొరికే అవకాశం ఉందన్నారు. ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆధారాలను సేకరిస్తున్న క్లూస్ టీమ్ సభ్యులు

ఎండలు బాబోయ్ ఎండలు

ప్రజాశక్తి - సీతంపేట

గతేడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి నీరు చెమ్మ లేకపోవడంతో ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. మే నెలాకరు వస్తున్నప్పటికీ రుతుపవనాల్లో ఏమాత్రం మార్పు రాలేదు. గత రెండు రోజులుగా కొద్దిపాటి వర్షాలు కురిసినప్పటికీ ఉష్ణోగ్రతలు మాత్రం ఏ మాత్రం తగ్గలేదు. అయితే గత రెండు రోజులుగా ఉదయం 6 గంటల నుండి సాయంత్రం ఐదున్నర గంటల వరకు ఎండ ఏకధాటిగా ఉండడంతో ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. అత్యవసర సమయమైతే తప్ప మిగతా సందర్భంలో సాయంత్రం 5 తర్వాతనే రోడ్డుపైకి ప్రజలు వస్తున్నారు. 40 డిగ్రీలు పైగానే ఉష్ణోగ్రతలు పెరగడంతో ప్రజలు బయటకు రాక రహదారులు నిర్మానుష్యంగా మారాయి. మరోపక్క ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. భూమి నుంచి వేడి పొగలు. ఒకవేళ గాలి వేసిన వేడిగాలి రావడంతో పిల్లలు, వృద్దులు తీవ్ర అవస్థలుపడుతున్నారు. ఎండను తట్టుకోలేక మూగజీవాలు చెట్టు కింద సేద తీర్చుకుంటున్నాయి. ఈ ఎండలకు ఊట బావుల్లోనూ గెడ్డల్లో, చెరువుల్లో నీరు ఇంకిపోవడంతో పశువులు, జంతువులు దాహాన్ని తీర్చుకోలేని పరిస్థితి నెలకొంది.

కానరాని స్వచ్ఛత

పార్వతీపురంటౌన్: స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ముందున్న ప్రధాన కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో మురుగునీరు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. ఈ వ్యర్థాలను తొలగించేందుకు మున్సిపల్ ప్రజారోగ్య అధికారులు గానీ, ఆ వార్డు పరిధిలో ఉన్న సచివాలయ శానిటరీ సెక్రటరీలు గానీ చర్యలు చేపట్టకపోవడంతో పట్ల స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. వర్షాకాలం రానున్న దృష్ట్యా పట్టణ ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న కాలువలతో పాటు, పట్టణంలోని పలు వీధుల్లో ఉన్న కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను, పూడికలు తొలగించేందుకు మున్సిపల్ ప్రజారోగ్య శాఖ అధికారులు సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ప్రజల కోరుతున్నారు.

సమగ్ర విచారణ చేపట్టాలి

పార్వతీపురం రూరల్: స్థానిక ఐటిడిఎ పరిధిలో జరిగిన సిఆర్‌టిల రెగ్యులరైజేషన్ కోసం సుమారు రూ.2 కోట్లు వసూళ్లు చేశారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్ కుమార్, గిరిజన నిరుద్యోగ సంఘం నాయకులు ఉర్లక నాగార్జున, ఆరిక ప్రభాకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఆదివారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ముగ్గురు సీఆర్టీల ద్వారా ఐడిటిఎ డిడి విభాగం అధికారులు సీఆర్టీల రెగ్యులరైజేషన్ కోసం సుమారు రూ.2కోట్లు వరకు అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయని, వీటిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. అలాగే ప్రభుత్వ ఉత్తర్వులకు వ్యతిరేకంగా బాలికల పాఠశాలల్లో పురుష ఉపాధ్యాయులను నియమించిన డిడి, సూపరింటెండెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పర్యాటకుల సందడి

సీతంపేట: స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. వేసవి సెలవులతో పాటు ఆదివారం సెలవు దినం కావడంతో పర్యాటకులు పార్క్‌కు పోటెత్తారు. కుటుంబ సభ్యులతో గడపడానికి వచ్చారు. పార్క్‌లో ఉన్న అందాలను ఆస్వాదించారు. జలవిహార్ వద్ద బోట్ షికారు చేశారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై యువతీ యువకులు నడిచి వెళ్లారు. జెయింట్ వీల్ ఎక్కి ఉయ్యాల్లో ఊగారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర్లు కొట్టారు.

CHANGE OF DATE OF BIRTH

I, No. 2607414Y Rank CHM Name **BALAGA SRINIVASA RAO** is legally have son of Balaga Rohit residing at Panukuvalasa Vill, Subhadra Post, Bobbili Tk, Vizianagaram Dist, Andhra Pradesh-535558(Address)

I have changed Date of Birth of my Son from **15 Sep 2007** (existing date of birth of Son as per change in official record) to **15 Sep 2008** (New/ proposed Date of Birth) vide affidavit dated: 16-O5-2024